క్లుప్తంగా

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



తంగేడులో వైద్య శిబిరంలో పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీనరసింహరాజు

కోటవురట్ల: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ ఆర్ఎస్ లక్ష్మీనరసింహరాజు కోరారు. తంగేడు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మహిళలకు పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహరాజు మాట్లాడుతూ ప్రధానంగా ఇంటిని తీర్చిదిద్దే మహిళలే ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంతో మహిళలు ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఈ శిబిరంలో సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చీపుర్లు పట్టిన అధికారులు



మండల పరిషత్ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు

కోటవురట్ల: అధికారులు ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్ అంటూ చీపురుపట్టారు. మండలంలో స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు చీపుర్లు చేతపట్టి మండల పరిషత్ ఆవరణలో శుభ్రం చేశారు. చెత్తను తొలగించి పరిశుభ్రత కోసం పిలుపునిచ్చారు. అనంతరం బి.కె.పల్లి గ్రామంలో కార్యక్రమం నిర్వహించి వీధుల్లో చెత్తను తొలగించి స్థానికులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం, సర్పంచ్ లింగన్ననాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులను డీఎల్‌డీవో నాగలక్ష్మి గురువారం సన్మానం చేశారు. స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసి, రైస్ బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు, కూండ్రపు సత్యారావు, మోటూరు సంజీవి, చుక్క అనురాధ, పంచాయతీ సెక్రటరీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం యలమంచిలి టౌన్ ఫీడర్-3 పరిధిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ధర్మవరం, సైతారుపేట రోడ్డు, కట్టుపాలెం, పాతవీధి, కొత్తపాలెం, సోమలింగపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

మూగబోయిన ఏపీ ఫైబర్ నెట్

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో మూడు రోజులుగా ఏపీ ఫైబర్ నెట్ సేవలు నిలిచిపోయాయి. మంగళవారం నుంచి ఏపీ ఫైబర్ నెట్ మరమ్మతులకు గురైంది. దీంతో వైఫై, నెట్, టీవీలు రాక వందలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం ఏపీ ఫైబర్ నెట్ సేవలు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీ నుండి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంలో ఏడు గ్రూపులు ఉన్నాయన్నారు. బిఏ, హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఏ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ ఫిజిక్స్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

పాహిమాం.. జగన్మాతా.. రక్షమాం



వాడ్రాపల్లిలో గీతాలాపన చేస్తున్న కళాకారులు



మునగపాకలో కాత్యాయని అవతారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు అమ్మవార్ల దేవాలయాల్లో నాలుగో రోజైన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డు, ఎస్.రాయవరం గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అడ్డురోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన విద్యుత్ షెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గమ్మను రోజుకొక రూపంలో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. నాలుగు రోజులుగా నవరాత్రుల ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి.

కాత్యాయని అవతారంలో కనకదుర్గమ్మ

మునగపాక: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా గురువారం కనకదుర్గమ్మ తల్లి భక్తులకు కాత్యాయని అవతారంలో దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయ ప్రాంగణంలో గౌరీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రసాద్ తల్లి ఆదియమ్మ ప్రారంభించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పలు చోట్ల కుంకుమ పూజలు నిర్వహించారు.



ఎస్.రాయవరంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



స్పేసెస్ డిగ్రీ కళాశాలలో దశమి వేడుకలు

అలరించిన సంకీర్తనలు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు ఆలపించిన గీతాలు ఆధ్యాత్మిక శోభను తెచ్చాయి.

పాయకరావుపేట: స్పేసెస్ డిగ్రీ కళాశాలలో విజయ దశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేశారు. లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. విద్యార్థులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కోలాటం, బతుకమ్మ, దాండియా, భరతనాట్యం, డోలీ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలాల్లో శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన



మునగపాకలోని పేటకట్టు ప్రాంతంలో వరి పొలం పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి చెరకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, పీవీ పద్మావతి, ఎస్.రాజ్‌కుమార్ కోరారు. గురువారం వారు మునగపాకలోని పేటకట్టు, తిమ్మరాజుపేట గ్రామాల్లో సాగవుతున్న వరి పొలాలతో పాటు చెరకు తోటలను పరిశీలించారు. వరిలో పొటాష్ లోపం ఉన్నట్లు గుర్తించారు. పొడతెగులు, ఆకుముడత తెగులు సోకినట్లు నిర్ధారించారు. పొటాష్ లోపానికి ఎకరాకు 20 నుంచి 25 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. లేకుంటే 19.19.19 పిచికారీ చేయాలన్నారు. కలుపు నివారణకు బిస్పైర్ ప్యాక్ సోడియంను ఎకరాకు 80 మిల్లీలీటర్ల విప్ సూపర్ అందించాలన్నారు. పొడ తెగులు నివారణకు ప్రొపికొనజాల్‌ను ఎకరాకు 250 మిల్లీలీటర్లు, ఆకు ముడత తెగులు నివారణకు ఎకరాకు కార్టప్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాముల మేర పిచికారీ చేయాలన్నారు. చెరకు తోటలకు సంబంధించి నల్లి నివారణకు ఎకరాకు 400 మిల్లీలీటర్ల వంతున డైమిథియేట్ పిచికారీ చేయడం మంచిదన్నారు. ఏఈవో లక్ష్మి, పద్మిని, వీఏఏ సరిత, రైతులు ఆడారి మహేశ్వరరావు, ఆడారి లక్ష్మణరావు, బొడ్డేడ రాజు, మళ్ల నాగేశ్వరరావు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తోటాడలో సమస్యల పరిష్కారానికి కృషి



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మంగవేణి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. పాలకవర్గం సహకారంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. మునగపాక జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ తన కోటా ద్వారా గవర్ల అనకాపల్లిలోని ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని కాలువ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయడంతో పనులు దాదాపుగా పూర్తికానున్న సందర్భంలో గురువారం స్థానిక ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మితో పాటు వార్డు సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటాడ పంచాయతీ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీటీసీ సభ్యులు స్వామి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపేటి పరమేష్, పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, సుధాకర్, బాగేశ్వరరావు, మళ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాండవ బ్రిడ్జిపై ట్రాఫిక్ కష్టాలు



తాండవ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన దుకాణాలు



ఫుట్‌పాత్‌పై చేపల విక్రయాలు

పాయకరావుపేట: పట్టణ పరిధిలోని తాండవ నదిపై ఉన్న బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. వంతెన ప్రారంభంలో చిరు వ్యాపారులు విక్రయాలు చేపట్టడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. తాండవ నదిపై పాయకరావుపేట పట్టణానికి తునికి అనుసంధానంగా బ్రిడ్జి ఉంది. ఈ బ్రిడ్జిపై ఇరువైపులా ఫుట్‌పాత్‌పై పలువురు చిరువ్యాపారాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట నుంచి తునికి నిత్యం వందలాది వాహనాలు, వేలాది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జిపై రెండు వైపులా చిరు వర్తకులు పండ్లు, కూరగాయలు, మొక్కలు, తినుబండారాలు అమ్మకాలు చేపడుతున్నారు. అలాగే చేపలు అమ్మకాలు కూడా ఇక్కడ కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి కార్యాలయాలకు, విద్యా సంస్థలకు చేరుకోలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాండవ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారులను, చేపల దుకాణాలను తొలగించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసిరావు, తదితరులు పుష్పాంజలి ఘటిస్తూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టాభి ప్రసాద్, జె.వి.ఎస్.రాజు, కర్రి వెంకట స్వామి నాయుడు, మామిడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టి.సిరసపల్లిలో రహదారి ఆక్రమణ



టి.సిరసపల్లిలో కుదించుకుపోతున్న ప్రధాన రహదారి

మునగపాక: టి.సిరసపల్లిలో ప్రధాన రహదారి ఆక్రమణకు గురవుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడకు వెళ్లేందుకు నిత్యం వందలాది మంది పలు రూపాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అనకాపల్లి, మునగపాక, పరవాడ మండలాలకు చెందిన పలు వాహనదారులు ఈ మార్గం గుండా ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ప్రయాణం సాగిస్తుంటారు. అయితే టి.సిరసపల్లి వద్ద ప్రస్తుతం ఉన్న రహదారి రోజురోజుకూ ఆక్రమణలకు గురికావడంతో కుదించుకుపోతోంది. మలుపుల వద్ద రహదారి కుదించుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలకు గురవుతున్న రహదారిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

'బల్క్ డ్రగ్ పార్కును తక్షణమే రద్దు చేయాలి'



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను తక్షణమే రద్దు చేయాలని మత్స్యకారులు పెద్ద ఎత్తున నిరసనలు చేస్తుంటే, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు చీమకుట్టినట్టయినా లేకుండా పోయిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు అన్నారు. ఈ మేరకు మత్స్యకారులకు మద్దతుగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. సీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిలా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మత్స్యకారులకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్న సమయంలో యలమంచిలి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. ప్రశ్నించే వ్యక్తులను అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మత్స్యకారులు శాంతియుతంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిరసన తెలియజేస్తుంటే ప్రజల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసులతో బంధించి, కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్న అప్పటి చంద్రబాబు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని దీనిపై పోరాటాలు చేయాలని చెప్పి, సీఎంగా చంద్రబాబు గద్దెనెక్కిన తరువాత బల్క్‌డ్రగ్ పార్కును ఏర్పాటు చేయాలని చర్యలు తీసుకోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌తో మత్స్యకారుల జీవనోపాధి, స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పార్క్ నిర్మాణంతో సముద్ర కాలుష్యం పెరిగి మత్స్య సంపద నాశనం అవుతుందన్నారు. అభివృద్ధి పేరిట ప్రజల పునరావాసం, జీవన భద్రతలను పక్కన పెట్టి, కార్పొరేట్ లాభాల కోసం మాత్రమే కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు అల్లు రాజు, పార్టీ నాయకులు గండి నాయనబాబు, కె.తేల్లయ్య బాబు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, నూకఅప్పారావు, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు



పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాకలో గురువారం పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, దిగువ ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో నిత్యపూజలు, అర్చనలు పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని పుణ్యకోటి వాహనంలో ఉంచి తిరువీధి సేవలకు తీసుకెళ్లారు. భక్తులు కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. సాయంత్రం సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని అర్చకులు వరప్రసాద్, కృష్ణమాచార్యులు తెలిపారు.

వైద్య శిబిరంలో 408 మందికి పరీక్షలు



సోమలింగపాలెంలో వైద్య శిబిరం పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్,

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో 408 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కంటి వైద్య పరీక్షల్లో దృష్టిలోపం ఉన్నవారికి కళ్లజోళ్లు ఇచ్చారు. ఈ శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రి శివశంకర్, ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు, పప్పు ఈశ్వరరావు, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై శిక్షణ

రోలుగుంట: వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్తంగా జానకీరాంపురం గ్రామంలో గురువారం జీవన ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం వల్ల రానురాను భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు జీవన ఎరువుల వినియోగించి భూసారం పెంచుకోవాలన్నారు. నత్రజనిని అందించే అజోస్పైరిలం, అసిటోబాక్టర్ అజల్లా భాస్వరాన్ని అందించే ఫాస్పరస్ సాల్యుబలైజింగ్, బ్యాక్టీరియా, పొటాస్ అందించే రిలీజింగ్ బ్యాక్టీరియా ఏ విధంగా వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ బీటీఎం లక్ష్మీ కిశోర్, సర్పంచ్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ముసిలినాయుడు పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఆపైన చదివి, 18 నుంచి 44 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


స్వచ్ఛత అందరి బాధ్యత



పట్టణంలో రాజీవ్ క్రీడా మైదానంలో వ్యర్థాలు తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికా

యలమంచిలి రూరల్: స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు కోరారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా గురువారం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో 'ఏక్ దిన్ ఏక్ గంట.. ఏక్ సాత్'కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్, సచివాలయం, వాకర్స్ క్లబ్ సభ్యులు, పారిశుధ్య సిబ్బంది సంయుక్తంగా మైదానంలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించారు. పట్టణ ప్రజలంతా నెలలో ఒకసారి పరిశుభ్రత కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని స్వచ్ఛ యలమంచిలికి సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

కశింకోట: కశింకోటలో గురువారం సాయంత్రం సత్తెమ్మతల్లి బోనాల(ఘటాల) ఊరేగింపు ఘనంగా జరిగింది. అత్యధిక మంది మహిళలతో పాటు పురుషులు బోనాలు తలపై పెట్టుకొని స్థానిక కస్పా వీధి నుంచి పెద్ద ఊరేగింపుగా బయలుదేరారు. అక్కడి నుంచి పెద్ద బజారు, గవరపేట మీదుగా కనక మహాలక్ష్మి వీధి వరకు ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా చెట్టు భజనలు, డప్పులతో బాణసంచా కాలుస్తూ అమ్మవారిని ఊరేగించారు. ప్రజలు దారి పొడవునా బిందెలతో రోడ్డుపై నీరు పోసి అమ్మవారికి భక్తి పారవశ్యంతో ఆహ్వానం పలికారు. కనక మహాలక్ష్మి ఆలయం నుంచి పిసినికాడ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి ఆలయానికి బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి నివేదించి పూజలు చేశారు.

క్రెబ్స్ పరిశ్రమ కార్మికుల ఆందోళన



తేగాడ వద్ద క్రెబ్స్ పరిశ్రమలో కార్మికుల ఆందోళన

కశింకోట: తేగాడ గ్రామం వద్ద ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమలో లే-ఆఫ్‌ను ఎత్తి వేసి, పరిశ్రమను తక్షణమే తెరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఎ.వి.అప్పారావు, కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ క్రెబ్స్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా శుద్ధి చేయకుండా వ్యర్థాలను విడిచిపెడుతుందని ఆరోపిస్తూ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నోటీసులు ఇచ్చి పరిశ్రమను ఐదు నెలల క్రితం మూసి వేశారన్నారు. దీని వల్ల సుమారు 350 మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పరిశ్రమలు, లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేస్తుందని, ఉన్న పరిశ్రమను మాత్రం మూసి వేసి 350 మంది కార్మికుల పొట్టకొట్టిందని విమర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని పరిశ్రమ తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పారావు, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుతో శ్రమశక్తి దోపిడీ

అనకాపల్లి: కార్మికుల 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచడం శ్రమశక్తి దోపిడీ చేయడమేనని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్ని యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమలలో కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసనమండలిలో చేసిన తీర్మానాలను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్మికుల జీతాలను పెంచేలా ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డి.డి.నాయుడు

అనకాపల్లి టౌన్: వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డి.డి.నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించి పలు వార్డులలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆస్పత్రికి ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్న వారు వస్తున్నారని, వారందరికీ సత్వర వైద్య సేవలందిస్తున్నామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com